


'రైతులకు రుణాలందజేతకు సిద్ధం'


రుణాలు అందజేస్తున్న చాగంటి

నరసాపురం : రైతులకు సకాలంలో రుణాలందించేందుకు సొసైటీలు సిద్ధంగా ఉంటాయని సొసైటీ ఛైర్మన్ చాగంటి పార్థసారధి అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మణేశ్వరం సొసైటీలో డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ(చిన్న)తో కలిపి దీర్ఘకాలిక అప్పులకు సంబంధించిన రూ. 45 లక్షల రుణాలను రైతులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ కావాల్సిన నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించడంతో పాటు సాగుకు అవసరమైన రుణాలను కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ముదునూరి సత్యనారాయణరాజు, దొంగ రామలక్ష్మి, జి.వెంకటేశ్వరావు, దాసరి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.


మొక్కజొన్నకు .. అగ్రిమెంట్లు రాసేనా..!



'గడిచిన ఏడాది పలు కంపెనీలు అందించిన మొక్కజొన్న సీడ్స్‌తో న్యూజివీడు మండలం గొల్లపల్లి, మోర్సపూడి, రావిచర్ల, న్యూజివీడు టౌన్‌తోపాటు ముసునూరు మండలంలోనూ 200 మందికిపైగా రైతులు నష్టపోయారు. పలు మొక్కజొన్న కంపెనీలు ఇచ్చిన నాణ్యతలేని సీడ్స్‌తో దిగుబడి రాక రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. అగ్రిమెంట్లు లేకపోవడంతో రైతులకు నష్టపరిహారం ఇచ్చేందుకు కంపెనీలు ససేమీరా అన్నాయి. దీంతో సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటం చేయగా రూ.70 లక్షలు రైతులకు నష్టపరిహారంగా ఇప్పించిన పరిస్థితి నెలకొంది. అగ్రిమెంట్లు రాయకుండా సీడ్స్ కంపెనీలు పెద్ద ఎత్తున మోసం చేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది.'

'ద్వారకాతిరుమల మండలంలోని పంగిడిగూడెం, హనుమాన్‌గూడెం వంటి గ్రామాల్లో రైతుల నుంచి మొక్కజొన్న పంటను కొనుగోలు చేసిన కంపెనీ ఆర్గనైజర్లు సొమ్ములు ఇవ్వకుండా ఎగనామం పెట్టారు. దీంతో సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేయగా కొద్ది మంది రైతులకు సొమ్ములు అందాయి. ఇప్పటికీ చాలా మంది రైతులకు పంట సొమ్ములు అందని పరిస్థితి నెలకొంది. అగ్రిమెంట్లు లేకపోవడంతో కంపెనీలు చేస్తున్న మోసాలకు ఇది ప్రత్యక్ష నిదర్శనం.'

'మొక్కజొన్న కంపెనీల మోసాలు జిల్లాలో ఏటా పెరిగిపోతున్నాయి. నాసిరకం సీడ్స్‌తో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. పంట తీసుకున్నాక సొమ్ములు ఇవ్వడం లేదు. సీడ్స్ అందించే కంపెనీలు రైతులకు అగ్రిమెంట్లు రాసే విధంగా చర్యలు తీసుకోవాలంటూ ఆగస్టు 18న జరిగిన డిఆర్‌సి సమావేశంలో దెందులూరు, పోలవరం ఎంఎల్‌ఎలు చింతమనేని ప్రభాకర్, చిర్రి బాలరాజు గళం విప్పిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది మొక్కజొన్న కంపెనీలు అగ్రిమెంట్లు రాసేవిధంగా చర్యలు తీసుకోవాలంటూ వ్యవసాయ శాఖ అధికారులకు ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలు జారీ చేయడం జరిగింది.'


మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని వ్యవసాయ శాఖ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతులు, రైతు సంఘం నాయకులు (ఫైల్‌ఫొటో)

మొక్కజొన్న సాగుకు రైతులు సన్నాహాలు
సీడ్స్ అందించే పనిలో కంపెనీలు బిజీబిజీ
రైతులకు అగ్రిమెంట్లు రాసేవిధంగా వ్యవసాయశాఖ చర్యలు తీసుకునేనా
ఆగస్టు 18న డిఆర్‌సి సమావేశంలో మొక్కజొన్న కంపెనీల తీరుపై ఎంఎల్‌ఎల గళం
అగ్రిమెంట్ల అమలుపై అధికారులకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మొక్కజొన్న సాగుకు జిల్లా రైతాంగం సన్నద్ధమవుతోంది. జిల్లా వ్యాప్తంగా లక్షకుపైగా పైగా ఎకరాల్లో మొక్కజొన్న సాగు సాగనుంది. అతిపెద్దసాగుగా ఉన్న మొక్కజొన్న పంటపై వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొక్కజొన్న సాగులో రెండు రకాల సాగు పద్ధతులను రైతులు అవలంబిస్తున్నారు. ఒకటి వాణిజ్య (కమర్షియల్) సాగు కాగా, రెండోది కంపెనీలు సీడ్స్‌తో చేసే సాగు. కమర్షియల్ సాగులో వచ్చే పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. సీడ్స్ సాగుకు సంబంధించి అంతా కంపెనీల కనుసన్నల్లోనే సాగుతోంది. ఇదే అదునుగా మొక్కజొన్న సీడ్స్ కంపెనీలు మోసాలకు పాల్పడుతున్నాయి. మొక్కజొన్న సాగు అక్టోబర్‌లో ప్రారంభించి నవంబర్ రెండో వారం వరకూ రైతులు విత్తనాలు నాటుతారు. కొన్ని కంపెనీలు రైతులను మోసం చేసి డిసెంబర్‌లో సాగు చేయిస్తున్నారు. నాలుగు టన్నుల దిగుబడి వస్తుందని కంపెనీలు చెప్పి రైతులకు అంటగడుతున్నారు. దిగుబడి మాత్రం టన్నున్నర కూడా రావడం లేదు. పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నిబంధనల ప్రకారం కంపెనీలు అందించిన సీడ్స్ దిగుబడి రాకపోతే రైతులను ఆయా కంపెనీలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాల్సి ఉంటుంది. కంపెనీలు మాత్రం రైతులకు ఏ మాత్రమూ అండగా నిలబడడం లేదు. దీనికి ప్రధాన కారణం మొక్కజొన్న కంపెనీలు రైతులకు అగ్రిమెంట్లు రాయకపోవడమే. రైతులకు సీడ్స్ అందించే కంపెనీలు అగ్రిమెంట్లు రాయాల్సి ఉంటుంది. జిల్లాలో ఎక్కడా అలా జరగడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. మొక్కజొన్న కంపెనీలు తమ మండలాల్లో ఎన్ని ఎకరాల సాగుకు సీడ్స్ అందించాయో కూడా మండల వ్యవసాయాధికారుల వద్ద సమాచారం ఉండడం లేదు. నష్టపోయిన రైతులు వ్యవసాయధికారుల వద్దకు వెళితే తాము ఏమీ చేయలేమన్నట్లు చేతులెత్తేస్తున్నారు. రైతు సంఘాలు, సిపిఎం రైతుల తరపున పోరాడి కొంతమేర న్యాయం చేయగలుగుతున్నాయి.

రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

మొక్కజొన్న సీడ్స్ సాగు చేసే రైతులకు అగ్రిమెంట్లపై అవగాహన కల్పించడంలో వ్యవసాయధికారులు విఫలమవుతున్నారు. ముందుగానే మొక్కజొన్న సాగుచేసే రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాల్సి ఉన్నా సరిగ్గా జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అగ్రిమెంట్లు లేకుండా సీడ్స్ అందించేందుకు వీల్లేకుండా కంపెనీలపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నా అటువంటి చర్యలు జరగడం లేదు. దీంతో మొక్కజొన్న కంపెనీలు తాము ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఆగస్టు 18న కలెక్టరేట్‌లో జరిగిన డిఆర్‌సి సమావేశంలో మొక్కజొన్న కంపెనీల తీరుపై ఎంఎల్‌ఎలు గళం విప్పారు. అగ్రిమెంట్లు రాసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈఏడాది అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. ఈ ఏడాదైనా అగ్రిమెంట్లు రాసేవిధంగా చర్యలు తీసుకుంటారో లేదో చూడాల్సి ఉంది.

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి


అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో సోనో విజన్, స్టార్ విజన్, రిలయన్స్ డిజిటల్, వైనాట్ ఎలక్ట్రికల్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్నోవేషన్ షాపింగ్, బజాజ్ ఎలక్ట్రానిక్స్, సత్య ఎలక్ట్రానిక్స్ తదితర కంపెనీలు ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించి, జిఎస్‌టి రేట్ల తగ్గింపును పరిశీలించారు. ఎలక్ట్రానిక్స్ గూడ్స్‌పై జిఎస్‌టి తగ్గింపునకు ముందు ప్రస్తుతం ఉన్న ధరల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సేల్స్ ఏ విధంగా ఉన్నాయి, గతంలో కంటే పెరిగాయా, లేదా అని షాపు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. సామాన్యుల్లో కొనుగోలు సామర్థ్యం పెంచాలనే లక్ష్యంతో, సామాన్య ప్రజలకు ధరలు అందుబాటులో ఉంచేందుకు జిఎస్‌టి 2.0ను అమల్లోకి తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ బి.శివన్నారాయణ రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ కెపి.శైలజ, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ కేథారేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లాలో సదరన్ క్యాంపులు నిర్వహించాలి

కలెక్టర్ నాగరాణి



మెగా మేళాను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో పక్కాగా సదరన్ క్యాంపులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి వికలాంగుల పింఛన్ల పున్ణపరిశీలనపై డిఎంహెచ్‌ఒ, డిసిహెచ్‌ఎస్, ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్, డిఆర్‌డిఎ పీడీలతో సమీక్షించారు. జిల్లాలో వికలాంగుల పెన్షన్ పున్ణపరిశీలన నిమిత్తం అప్పీల్ చేసుకున్న 1,360 మందికి తిరిగి వికలాంగత్వ శాతం పరీక్షలను వైద్యులు పక్కాగా నిర్వహించి నివేదికలను సమర్పించాలన్నారు. దీని నిమిత్తం జిల్లాలోని తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, భీమవరం ప్రాంతాల్లో సదరన్ క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. వికలాంగులు పెన్షన్లు పొందడంలో ఏ విధమైన ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పున్ణపరిశీలన తర్వాత నివేదికల ఆధారంగా పెన్షన్ కొనసాగింపులో ఏ విధమైన సందేహం ఉండదని వెల్లడించారు. ఈ సమావేశంలో డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ జి.గీతాబాయి, డిసిహెచ్‌ఎస్ పి.సూర్యనారాయణ, ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి శ్రవణ్, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్‌ఎస్.వేణుగోపాల్ పాల్గొన్నారు.

బోధనేతర కార్యక్రమాలు బహిష్కరణ

ఎంఇఒకు ఫ్యాప్టో ఆధ్వర్యాన వినతి


కాళ్లలో వినతిని అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - కాళ్ల

మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వల్ల బోధన సమయం హరించుకుపోతుందని, ఉపాధ్యాయులకు కూడా బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోయాయని పలుధపాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా, ఏమాత్రం పట్టించుకోనందున శుక్రవారం బోధనేతర కార్యక్రమాలను బహిష్కరించాలని రాష్ట్ర ఫ్యాప్టో పిలుపునిచ్చింది. శుక్రవారం మండల విద్యాశాఖాధికారి డి.శ్రీనివాసరావుకి మెమోరాండం అందజేశారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్నం భోజన పథకమునకు సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారని, మూల్యాంకానికి సంబంధించిన పరీక్ష నిర్వహణ తప్ప ఏ ఇతర బోధనేతర పనులు, అనవసరమైన గూగుల్ షీట్స్ నింపడం, విద్యాశక్తి, జిఎస్‌టి 2.0 లాంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలను చేపట్టబోమన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఫ్యాప్టో నాయకులు సిహెచ్.పట్టాభిరామయ్య, సిహెచ్.కుమార బాబ్జి, బిఆర్‌ఎంకె.స్వామి, పి.పాపారావు, వి.గణేష్, ఎం.శంకర్రావు, సిహెచ్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకివీడు : బోధనేతర పనులు, విద్యాశక్తి కార్యక్రమాలను శుక్రవారం ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయ నాయకులు బహిష్కరించారు. ఈ మేరకు మండల స్థాయి ఫ్యాప్టో నాయకులు శుక్రవారం స్థానిక మండల విద్యాశాఖ అధికారి రవీంద్రకు విద్యాశాఖ కార్యాలయంలో నోటీసులు అందజేశారు. మితిమీరిన బోధనేతర పనులతో బోధనపై విరక్తి చెందే స్థాయిలో పె రిగిపోయాయన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నో సార్లు విజ్ఞప్తి చేస్తామని అన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో విజయవాడ పోరుబాట కార్యక్రమంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ బహిష్కరణ కార్యక్రమం చేపట్టామన్నారు. హాజరు, మధ్యాహ్న భోజన పథకాలకు సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారన్నారు. మూల్యాంకనానికి సంబంధించి పరీక్షల నిర్వహణ తప్ప గూగుల్ షీట్స్ నింపటం, విద్యా శక్తి, జిఎస్‌టి 2.0 లాంటి సీజనల్ పనులు చేపట్టబోమని వారు ఆ నోటీసులో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌విఎస్.నారాయణ, ఎస్.వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి


పాలకొల్లు : జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న నేతలు

ప్రజాశక్తి - పాలకొల్లు

మహిళా సమస్యలపై కలిసి పని చేయాలని ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు ఎస్.జయప్రభ అన్నారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో జరిగే ఐద్వా రాష్ట్ర మహాసభ సందర్భంగా స్థానిక మహిళా కార్యాలయం వద్ద శుక్రవారం సమావేశం జరిగింది. ఐద్వా జెండాను సీనియర్ సభ్యురాలు అరటికట్ల నారాయణమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయప్రభ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రయివేటీకరణ వేగంగా అమలు చేస్తూ పిపిపి విధానమని చెబుతున్నారన్నారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై మహిళా సంఘం ఐక్యంగా కదిలి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.రోజామణి, బి.శ్యామల, స్వరాజ్యలక్ష్మి, బి.సరోజినీ, యర్రా భాగ్యం, సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, వై.అజయ్, దేవ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు : అనంతపురంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో జరిగే ఐద్వా రాష్ట్ర 16వ మహాసభను జయప్రదం చేయాలని ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.అన్నపూర్ణ, కొత్తుర్తి నాగరత్నం కోరారు. తణుకు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మహాసభ సందర్భంగా పలు సెంటర్లలో జెండాలను ఆవిష్కరించారు. సిహెచ్ అన్నపూర్ణ, కె.నాగరత్నం మాట్లాడుతూ మహిళలు, బాలికలపై రోజు రోజుకూ అత్యాచారాలు పెరుగుతున్నాయన్నారు. అత్యాచారాలకు ప్రధాన కారణం మద్యం అని, మద్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. మహిళల సమస్యల పరిష్కారంలో ఐద్వా ముఖ్యపాత్ర పోషిస్తోందన్నారు. మహిళల అణిచివేత నుంచి విముక్తి కోసం, వారి అభ్యున్నతికి కృషి చేస్తోందని, స్త్రీల పట్ల జరిగే అసాంఘిక దురాచారాలను ఎదుర్కొనడలో ఐద్వా ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. కె.వరలక్ష్మి, మంగతాయారు, ఎస్.కుమారి, జి.ధనలక్ష్మి, బి.వరలక్ష్మి, పూర్ణ, పి.ధనలక్ష్మి, సత్యవతి, లక్ష్మి పాల్గొన్నారు.

ఆకివీడు : ఐద్వా 16వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ఐద్వా పట్టణ అధ్యక్షురాలు డోకల లక్ష్మి పిలుపునిచ్చారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక జవహార్ పేటలో డోగల లక్ష్మి శుక్రవారం ఐద్వా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా పట్టణ నాయకురాలు బి.కళ్యాణి అధ్యక్షతన జరిగిన సభలో డి.లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు మూడు సంవత్సరాలకు ఒకసారి రాష్ట్ర మహాసభలు జరుగుతాయన్నారు. అనంతపురంలో ఐద్వా 16వ రాష్ట్ర మహాసభ ఈనెల 13, 14, 15 తేదీల్లో జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఐద్వా పట్టణ నాయకులు జి.లావణ్య, జి.రాణి, పి.కృష్ణవేణి, డి.వెంకటలక్ష్మి, బి.సీతామహాలక్ష్మి, బి.సుభాషిణి పాల్గొన్నారు.

పేదలను ఒత్తిడి చేయడం సరికాదు

కార్పొరేట్ల రుణాలు రద్దు చేయడం ఎంత వరకూ సమంజసం

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

పేద, మధ్య తరగతి ప్రజలు తీసుకునే బ్యాంకు రుణాలపై విరుచుకుపడే బ్యాంకు యాజమాన్యాలు కార్పొరేట్లు తీసుకునే వేల కోట్ల రుణాల రద్దు చేయడం ఎంతవరకూ సమంజసమని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. పేద మధ్యతరగతి ప్రజలు తీసుకున్న టిడ్కో గృహాల లోన్లు, హౌసింగ్ లోన్లు కట్టాలని బ్యాంకు యాజమాన్యాలు ఒత్తుడులు చేస్తున్నాయన్నారు. వారి ఇళ్లకు బ్యాంకు అధికారులను పంపి గహాల ఫొటోలు తీసుకోవడం, నోటుసులు పంపడం, బెదిరింపు వంటి చర్యలు పాల్పడుతున్నారని తెలిపారు. వీటిని వెంటనే విరమించుకోవాలని కోరారు. ఈ విధంగా బ్యాంకు అధికారులు చేయడం ద్వారా లోన్లు తీసుకున్న పేదలు ఏదో జరిగిపోతోందని ఆందోళనకు గురౌతున్నారన్నారు. లోన్లు మంజూరై టిడ్కో గృహాలు లబ్ధిదారులకు ఇంకా ఇవ్వలేదని, వారిపై కూడా బ్యాంకు అధికారులు ఒత్తిడి చేయడం చాలా దారుణమైన విషయమని తెలిపారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. చివరకు వీరి ఖాతాలో ఏ డబ్బులు జమైనా ప్రభుత్వ స్కీముల నుండి గానీ, వారి అవసరాల నిమ్మిం బంధువుల నుండి ఇచ్చినవి గానీ బ్యాంకులో జమైతే చాలు వెంటనే వాటిని ఖాతాదారుల ప్రమేయం లేకుండా కట్ చేసుకుంటున్నారన్నారు. నీరవ్‌మోడీ, లలిత్‌మోడీ, సుబ్బిరామయ్య వంటి బడా కార్పొరేట్ల బ్యాంకుల్లో లోన్లు తీసుకుని ఇతర దేశాలకు పారిపోతే ఏమీ చేయని వీరు పేదలు, మధ్యతరగతి వారు గృహం ఏర్పాటు చేసుకోవడానికి తీసుకున్న చిన్నపాటి రుణం కోసం వారిపై ఇటువంటి దాడులకు దిగే నైతిక హక్కు బ్యాంకు యాజమాన్యాలకు లేదన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి


తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న విఆర్‌ఎలు

ప్రజాశక్తి - ఉండి

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 13, 14, 15వ తేదీల్లో విజయవాడలో జరగనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విఆర్‌ఎల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి.సుబ్బారావు, సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.ఆంజనేయులు కోరారు. శుక్రవారం తహశీల్దార్ కావడి నాగార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు, ఆంజనేయులు మాట్లాడుతూ విఆర్‌ఎలకు పే స్కేల్ అమలు చేయాలని, నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఒక పక్క పెరుగుతున్న ధరలు, మరో పక్క పని ఒత్తిడి విఆర్‌ఎలను ఆవేదనకు గురి చేస్తున్నాయన్నారు. విఆర్‌ఎలు అందిస్తున్న సేవలు అధికారులందరికీ తెలిసినప్పటికీ అధికారులు మాటలు పాలకులు వినే స్థితిలో లేనందు వల్ల సమస్యలు దీర్ఘకాలం కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడైనా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గణేష్, నాగరాజు, ఏసురత్నం, భాష, మణిమాల, శ్రీను, అచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

లెజెండ్రీ నాయకుడు నాగటి నారాయణ

వర్ధంతి సభలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రామానుజరావు


యలమంచిలిలో..

ప్రజాశక్తి - భీమవరం

లెజెండరీ నాయకుడు నాగటి నారాయణ అని యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జివివి.రామానుజరావు అన్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ ఉమ్మడి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి, ఉద్యమ నాయకులు నాగటి నారాయణ తృతీయ వర్ధంతి శుక్రవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామానుజరావు మాట్లాడుతూ ఉద్యమ నాయకులు అమరజీవి ఎవిఎస్ ఉద్యమ వారసునిగా బాధ్యతలు భుజాలకెత్తుకుని యుటిఎఫ్ ఉద్యమ ప్రస్థానాన్ని మరో మెట్టుకు ఎదిగించడంలో నారాయణ అద్వితీయ పాత్ర పోషించారని కొనియాడారు. జిల్లా అధ్యక్షుడు పిఎస్.విజయరామరాజు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిలు సిహెచ్.కుమారబాబ్జి, జి.రామకృష్ణంరాజు, జి.అబ్రహం, మండల నాయకులు పాల్గొన్నారు.

యలమంచిలి : యుటిఎఫ్ ఉమ్మడి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి, స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పూర్వపు జాతీయ ఉపాధ్యక్షులు, ప్రముఖ విద్యావేత్త నాగటి నారాయణ మూడవ వర్ధంతి సందర్భంగా యుటిఎఫ్ యలమంచిలి మండల శాఖ ఘనంగా నివాళులు అర్పించింది. నారాయణ పోరాటపటిమతో యుటిఎఫ్ ఉద్యమాన్ని ఉమ్మడి రాష్ట్ర వ్యాప్తంగా దశదిశల వ్యాప్తి చేశారని, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, మెరుగైన సమాజ నిర్మాణానికి జీవితాంతం కృషి చేశారని అన్నారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి పోలిశెట్టి క్రాంతికుమార్, మండల శాఖ అధ్యక్షులు గుత్తిందీవి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పంతం రామ్మూర్తి నాయుడు, కోశాధికారి వర్ధనపు సందీప్ కుమార్ పాల్గొన్నారు.

కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం : వైసిపి పిలుపుమేరకు మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్‌ను మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం స్థానిక వైసిపి క్యాంప్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వైసిపి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాల ఆవశ్యకతను తెలియజేస్తూ ఈనెల పదో తారీకు నుండి నవంబర్ 22 వరకు సుమారు 42 రోజులు ప్రతి గ్రామంలో ప్రజల తరపున రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ రచ్చబండ కార్యక్రమం ద్వారా కోటి సంతకాలను సేకరించి గవర్నర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 28వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో, నవంబర్ 12వ తేదీ నుంచి జిల్లా కేంద్రాల్లో మెడికల్ కాలేజీల ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలో ప్రయివేటీకరణను విరమించుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, వైసిపి పట్టణ అధ్యక్షులు కె.ధర్మరాజు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

'విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించాలి'

తాడేపల్లిగూడెం: విద్యార్థులు ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించి, నూతన ఆవిష్కరణలను చేపట్టాలని ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్‌వి.రమణారావు సూచించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆంధ్ర ప్రదేశ్(ఎపి నిట్)లో టెక్రియా 2కె25 కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్‌వి.రమణారావు మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనల్లో కొత్త శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. ఆలోచనలకు పదును పెడితే ఎన్నో అద్భుతాలను సృష్టించవచ్చని, విద్యార్థులు ఆ దిశగా కృషిచేయాలని తెలిపారు. కొలువుల సాధనకు నైపుణ్యాలే కీలకమని, విద్యార్థులు సాంకేతికతపై పట్టు సాధించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వర్ రెడ్డి కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. అనంతరం ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్‌వి. రమణారావును సాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టెక్రియా కార్యక్రమం కార్యదర్శి వేదాంత రెడ్డి, డీన్లు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, డాక్టర్ వీరేష్ కుమార్, విభాగాధిపతులు, పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.

8 గంటల పని విధానానికి తూట్లు

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ




నినదిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - నరసాపురం

పనిగంటల పెంపును నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మిక వర్గం అనేక పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానానికి తూట్లు పొడుస్తూ కార్మిక వర్గ హక్కులను కాలరాసే విధంగా 10 గంటల పని విధానాన్ని తీసుకురావడం రాష్ట్రంలో ఉద్యోగ, కార్మిక వర్గాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాలంలో కార్మికులకు, ఉద్యోగులకు వారి హక్కులను, చట్టాలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తూ, సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంలో తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. కార్మిక, ఉద్యోగుల హక్కులను హరించే విధంగా ఉన్న 10 గంటల పనివిధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కవురు నరసింహస్వామి, గుబ్బల రాజేశ్వరి, బొక్క ఆదిలక్ష్మి, పెనుగొండ జ్యోతిరత్నం, వై.ప్రభావతి, దొంగ రాజేశ్వరి, పులపర్తి రత్నకుమారి పాల్గొన్నారు.

ఎంపిడిఒగా వైభావతి


ఎంపిపిని కలిసిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం మండల పరిషత్ ఎంపిడిఒగా కెఎం.వైభావతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈమె గతంలో పోడూరులో పనిచేస్తూ బదిలీపై వీరవాసరం వచ్చారు. ఈమెకు కార్యాలయ సూపరింటెండెంట్ అప్పారావు, జూనియర్ అసిస్టెంట్ పవన్‌లు, ఇఒపిఆర్‌డిలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

గర్భిణులకు పోషకాహారం అందజేత

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు కొల్లా భాస్కరమ్మ శ్రీకొల్లా రాఘవులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పోషకాహారం అందజేశారు. ఆరోగ్యవంతమైన తల్లి, బిడ్డలను దృష్టిలో పెట్టుకుని వీరికి పళ్లు, డ్రైఫ్రూట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు ఏర్పాటుకు చర్యలు

ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని బస్ సౌకర్యం లేని నెలమూరు పరిసర గ్రామాలకి ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటారని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ హామీ ఇచ్చారు. శుక్రవారం మండలంలోని నెలమూరు, ఓడూరు గ్రామాల్లో జరిగిన పల్లె పల్లెకు మన పితాని కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో హరిజన శ్మశానవాటిక, హిందూ శ్మశానవాటిక సమస్యలను పరిష్కరించేందుకు గ్రామంలోని ప్రభుత్వ భూములను తక్షణమే సర్వే చేయాలని తహశీల్దార్‌కు ఆయన ఆదేశాలు ఇచ్చారు. ఎన్‌టిఆర్ కాలనీ ప్రధాన రహదారి సమస్యను భూసేకరణ ద్వారా పరిష్కరించాలని ఆయన సూచించారు. అలాగే నెలమూరు, ఓడూరు పరిసర గ్రామాలకు లింక్ రోడ్లు, వంతెనలు, గ్రామంలోని సీసీ రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ కృషిచేస్తానని పితాని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెలగల బుల్లి రామిరెడ్డి, గంటా వాసు, నెలమూరు సొసైటీ ఛైర్మన్ కోయ నాగ వెంకట పోతురాజు, చింతపల్లి రామకృష్ణ, గూడూరి మురళీమోహన్, జనసేన కోయ వెంకట కార్తీక్, స్థాయి అధికారులు, అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైఎన్‌లో వర్క్‌షాప్

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక శ్రీవైఎన్ కళాశాలలో మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం, ఐక్యూఎసి ఆధ్వర్యంలో 'ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ యంగ్ సిటిజెన్' అనే అంశంపై ఈనెల 9, 10 రెండురోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్ కు కోటక్ సెక్యూరిటీస్ వారి సామాజిక బాధ్యతలో భాగంగా అందరికి విద్య పథకంలో భాగంగా విజయవాడలోని మూన్స్ కన్సల్టెన్సీ ప్రయివేట్ లిమిటెడ్, మేనేజింగ్ డైరెక్టర్ చిలుకూరి విజయకుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. విజయకుమార్ మాట్లాడుతూ జాబ్ చేసినా, వ్యాపారం చేసినా డబ్బును సంపాదిస్తాం, అందులో మనం సంపాదించిన డబ్బును ఖర్చు చేయగా మిగిలిన డబ్బును ఆదా చేస్తామన్నారు. కాని ఫైనాన్షియల్‌గా అభివృద్ధి చెందాలంటే డబ్బును ఆదా చేయడానికి ముఖ్యంగా ప్రాధాన్యత ఇచ్చి తరువాతే డబ్బును ఖర్చు పెట్టాలని స్పష్టం చేస్తూ రూల్ నెంబర్ 72 ద్వారా సేవింగ్స్ ప్రాముఖ్యతను వివరించారు. సెక్యూరిటీస్ మార్కెట్‌లో పెట్టుబడి అంశములు, మర్చెంట్ బ్యాంకింగ్ విధులు, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్ అందించే సర్టిఫికెట్ కోర్సెస్ వివరాలను, ఉద్యోగావకాశాలను విశదీకరించారు. కార్యక్రమంలో 150 మంది ఎంబిఎ, బిఎ విద్యార్థులు, కాలేజీ అకడమిక్ అండ్ రీసెర్చ్ అడ్వైజర్ ఆర్.సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతలపల్లి కనకారావు, డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.చింతారావు, మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఆర్.పార్ధసారథి, ఐక్యూఎసి కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గంధం శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

వైసిపి గ్రామ అధ్యక్షులుగా సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులుగా పెచ్చెట్టి సత్యనారాయణను నియమించినట్లు వైసిపి మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి తెలిపారు. శుక్రవారం ఆచంటలో వైసిపి గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర ఎంపిపి కర్రి వెంకట నారాయణ రెడ్డి (వాసు) మాట్లాడుతూ కూటమి అరాచక పాలనకు స్వస్తి పలికే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. 18 నెలల్లో తీవ్ర ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని ఆరోపించారు. నియోజకవర్గంలో వైసిపి ప్రజాప్రతినిధులకు కనీసం గౌరవం ఇవ్వకుండా, కూటమి నాయకులు అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సూపర్ సిక్స్ పేరుతూ ప్రజలను మోసం చేశారన్నారు. కార్యక్రమంలో కోట వెంకటేశ్వరరావు, సుంకర సీతారామ్, నంబూరి రాజా, అడ్డాల పెద్దిరాజు, బీరా శ్రీను, కోట గిరిధర్ పాల్గొన్నారు.

బాణసంచా వ్యాపారులకు లైసెన్సులు తప్పనిసరి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

బాణసంచా వ్యాపారులు తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ ఖతిబ్ కౌసర్ భానో తెలిపారు. శుక్రవారం తాడేపల్లిగూడెం డివిజన్ బాణసంచా వ్యాపారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ బాణసంచా వ్యాపారులు తప్పనిసరిగా లైసెన్సులు పొందాలని, తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో బాణసంచా తయారీకి ఎలాంటి అనుమతులు లేవన్నారు. బాణసంచా షాపుల్లో రెవెన్యూ, పోలీస్, ఫైర్, విజిలెన్స్ టీమ్స్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తహశీల్దార్ సునీల్ కుమార్, అత్తిలి తహశీల్దార్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఆక్వా చెరువులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మత్స్యశాఖ అధికారి భారతి

నరసాపురం : తీర ప్రాంతంలో ఆక్వా సాగు చేసే రైతులు విధిగా తమ చెరువుల్ని రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని మత్స్యశాఖ అధికారి భారతి తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు ప్రభుత్వం అందించే విద్యుత్ రాయితీ యూనిట్‌కు రూ.1.50 లభిస్తుందన్నారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. సిఎఎ రిజిస్ట్రేషన్ చేయించుకునే రైతులు పాటదారి పుస్తకం, ఆధార్, పాస్‌పోర్టు, సైజ్ ఫోటోలు, విఆర్‌ఒ నోఅబ్జెక్షన్, యూనిట్ విలువ తదితర వివరాలను తీసుకుని సంబంధిత సచివాలయాల్లో సంప్రదించాలన్నారు.

కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై అవగాహన

పాలకొల్లు : పాలకొల్లు డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ పాలకొల్లు రైజింగ్ సంస్థ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సభలో చార్టెడ్ అకౌంటెంట్ బంగారు మనోజ్ విష్ణు మాట్లాడుతూ దైనందిన జీవితంలో వివిధ సందర్భాల్లో ఎందుకు, ఎలా, ఎప్పుడు, ఏవిధంగా ప్రవర్తించాలి, ఎలా స్పందించాలి, ఎలా మాట్లాడాలి అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశలోనే పై విషయాలపై అవగాహన కలిగి ఉంటే ఏవిషయంలోనైనా విజయాన్ని సాధించవచ్చు అన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ శోభారాణి మాట్లాడారు. వారానికి ఒకసారి జరిగే ఈ కార్యక్రమాన్ని విద్యార్థినులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముద్దాయిలు అరెస్ట్

రూ.16 లక్షల విలువైన 162.25 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం

తణుకు : పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణ పరిధిలో దోపిడీకి పాల్పడిన ముద్దాయిలను తణుకు పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందితుల నుండి సుమారు రూ.16 లక్షల విలువైన 162.25 గ్రాముల బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. తణుకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీకి సంబంధించిన వివరాలను తాడేపల్లిగూడెం డిఎస్‌పి డి.విశ్వనాథ్ వెల్లడించారు. ఈ కేసులో ముద్దాయిలు మహారాష్ట్ర, ముంబైకి చెందిన సందీప్ రామశంకర్ ఉపాధ్యాయ, మహారాష్ట్ర, ముంబైకి చెందిన మహ్మద్ ఇక్బాల్ షేక్, రాజమండ్రి, తాడితోటకి చెందిన మీసాల శ్రీనివాసరావు, రాజమండ్రి, తాడితోటకి చెందిన నిమ్మకాయల శ్రీకాంత్, రాజమండ్రికి చెందిన దుర్గాపు సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు, రాజమండ్రి, శారదానగర్‌కి చెందిన దివ్వల యేసు, బిక్కవోలు మండలం, బలభద్రపురంకి చెందిన గొర్రెపూడి వెంకటరమణ, రాజమండ్రి 39వ వార్డుకి చెందిన శ్రీకాకుళం చిన్న, పెనుమంట్ర వెలగలవారి పాలెం, ప్రస్తుతం తాడేపల్లిగూడెం మండలం, పెదతాడేపల్లికి చెందిన కర్రి సాయిచంద్రారెడ్డి, రాజమండ్రి, కాతేరుకి చెందిన అంబటి రాజేష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. కేసు దర్యాప్తులో సహకరించిన తణుకు పట్టణ, తణుకు రూరల్, తాడేపల్లిగూడెం రూరల్ సిఐలు ఎన్.కొండయ్య, బి.కృష్ణకుమార్, బిబి.రవికుమార్‌లతో పాటు ఎస్ఐలు తణుకు టౌన్ కె.శ్రీనివాస్, కె.ప్రసాద్, తణుకు ట్రాఫిక్ డి.ఆదినారాయణ, తణుకు రూరల్ కె.చంద్రశేఖర్, అత్తిలి పి.ప్రేమ్‌రాజ్‌లకు డిఎస్‌పి డి.విశ్వనాథ్ అభినందనలు తెలియజేశారు.

మానసిక వికలాంగుల పట్ల గౌరవం కలిగి ఉండాలి

పలు చోట్ల ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి - నరసాపురం

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పీచుపాలెం రోడ్‌లో ఉన్న కళ్యాణి రూరల్ రీహాబిలిటేషన్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీలో న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరస్పాండెంట్ ఎ.నళిని దేవి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా నరసాపురం 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ.వాసంతి పాల్గొని మాట్లాడారు. పిల్లలు ఎల్లప్పుడూ నవ్వుతూ ఉంటే ఆరోగ్యంగా ఉంటారని, రాజ్యాంగం మానసిక వికలాంగులకు కూడా సమాన హక్కులు కల్పించిందన్నారు. ఎవరైనా వికలాంగులను అవహేళన చేసిన, శారీరకంగా, మానసికంగా వారిని గాని, వారి తల్లిదండ్రులను గానీ అవహేళనగా మాట్లాడిన, అవమానపరచినా మండల న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. వికలాంగులకు ఆస్తి పరంగా ఏమైనా సమస్యలు ఉంటే ఉచిత న్యాయ సహాయాన్ని ఉపయోగించుకోవాలన్నారు. న్యాయ సేవా సంస్థ వారు విద్యార్థులకు పండ్లు, న్యాయవాది సూర్య ప్రకాశ్ రావు అల్పాహారాన్ని అందించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు, బార్ అసోసియేషన్ కార్యదర్శి వి.సూర్య ప్రకాశరావు, పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.యాదగిరి, కళ్యాణి రూరల్ మనో వికాస కేంద్రం సెక్రటరీ మోహన్ బాబు రావు, లీగల్ సర్వీసెస్ సభ్యులు దానయ్య నాయుడు, వైడి.ఫణికర్, వై.సతీష్ కుమార్, కోర్టు లైజనింగ్ సూర్య భాస్కర్, లయన్స్ క్లబ్ సభ్యులు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.


తణుకులో..

తాడేపల్లిగూడెం : విద్యార్థులు ఇంటర్నెట్ సోషల్ మీడియాకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్నేహ మైండ్ క్లినిక్ అధినేత డాక్టర్ పృథ్వీరాజ్ సూచించారు. శుక్రవారం ఆదికవి నన్నయ్య విశ్వ విద్యాలయంలో తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెంటల్ హెల్త్ అవేర్నెస్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి లయన్ డాక్టర్ పృథ్వీరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు ముఖ్యంగా డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, అలానే ఇంటర్నెట్ మొబైల్ ఫోన్ లాంటివి అవసరం మేరకు మాత్రమే వినియోగించుకోవాలని, పరీక్షల సమయంలో విద్యార్థులు మానసికంగా, దృఢంగా ఉండాలని, నున్యూతాభావంకి లోను కాకూడదని, ఆత్మహత్యల ఆలోచనలు కలిగిన యెడల కుటుంబసభ్యులు, వైద్యులకు తెలియపర్చాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.అశోక్, కోర్స్ కోఆర్డినేటర్ బాబులు, ఫిజిక్స్ కోర్స్ కోఆర్డినేటర్ కెవిఎస్ఎన్.రాజు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం న్యాయ సేవ కమిటీ ఛైర్మన్, పదకొండవ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక ఆదిత్య జూనియర్ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి మాట్లాడారు. ఆదిత్య జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తణుకు : మానసిక వికలాంగుల పట్ల గౌరవం కలిగి ఉండాలని, వారిని కించపరచకూడదని, హక్కులకు భంగం కలిగించకూడదని న్యాయవాదులు కామన మునిస్వామి, కౌరు వెంకటేశ్వర్లు, అంగజాల అజయకుమార్ అన్నారు. మానసిక వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఛైర్మెన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు ఉండ్రాజవరం మండలంలో ఉన్న స్పందన మెంటల్ రీహబిలేషన్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగులకు అందుతున్న ఆహార, వసతి వైద్య సదుపాయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. జడ్జి ఆదేశాలతో డిఎంహెచ్‌ఒ రాజమండ్రి వారు ప్రతివారం స్పందన మానసిక వికలాంగుల సెంటర్‌ను విజిట్ చేయమని, పాలంగి ప్రైమరీ హెల్త్ సెంటర్ వారిని ఆదేశించారు. పారాలీగల్ వాలంటీర్లు కె.నాగమల్లీశ్వరి, ఎ.శ్రీదేవి, కాకర్ల నరసన్న, దూలపల్లి బ్రహ్మాజీ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించుకుని, ప్రశాంతమైన జీవనం సాగించాలని మానసిక వైద్యులు డాక్టర్ బి.రమేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల పిజి, యుజి(అటానమస్) కళాశాలలో అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపల్ యు.సుందరీబాయ్ అధ్యక్షతన జరిగింది. సైకాలజిస్ట్ వి.ధనశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.


చెక్కులను అందజేస్తున్న దాసరి వెంకటకృష్ణ

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - ఉండి

సిఎం సహాయనిధి నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా అని ఉండి మండల సర్పంచ్ల ఛాంబర్ అధ్యక్షులు, వాంద్రం గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ అన్నారు. శుక్రవారం ఉండి మండలం వాంద్రం గ్రామానికి చెందిన దవులూరి యేసయ్య, పర్వతాల రంగారావులకు సుమారు రూ.70 వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు సూచనల మేరకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందని కొనియాడారు. ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీలో లేని వ్యాధులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న తెల్ల రేషన్ కార్డుదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ వర్తించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి ముదుండి స్వరూప శ్యామ్, టిడిపి సీనియర్ నాయకులు కందుల బలరాం, సందక నాగరాజు, మాజీ ఉపసర్పంచి చిరగాపుల లక్ష్మీనారాయణ, లబ్ధిదారులు, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎం.ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

'ఆర్ఎస్‌కెలు సమర్థవంతంగా పనిచేయాలి'

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ సీజన్‌లో ధాన్యం సేకరణ చేయడంలో ఆర్ఎస్‌కెలు సమర్థవంతంగా పనిచేసి, జిల్లాకు ఆదర్శంగా నిలవాలని డిప్యూటీ తహశీల్దార్ ఎలియమ్మ, ఎంఎల్‌ఒ ఎంఎం.రెహమాన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద జరిగిన 2025-26 సంవత్సరానికి ధాన్యం సేకరణ గురించి ఆర్ఎస్‌కె, ఆర్‌బికె సిబ్బందికి శిక్షణా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. రైతులకు మద్దతు ధర ఇవ్వడానికి, పేద ప్రజలకు రేషన్ బియ్యం ఇవ్వడానికి ధాన్యం సేకరణ విస్తృతంగా జరగాలన్నారు. ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాల్లో వరి పండించే రైతులు మొత్తం రాష్ట్రానికి ధాన్యం అందిస్తున్నారన్నారు. ఈ శిక్షణలో మండలంలోని అన్ని గ్రామాల్లోని ధాన్యం సేకరణ ప్రతినిధులు పాల్గొన్నారు.

గణపవరం : మండలంలో 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం వ్యవసాయశాఖ కార్యాలయంలో సిబ్బందికి జరిగిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలలో సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న తహశీల్దార్ వైకెవి.అప్పారావు మాట్లాడారు. టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కస్టోడియన్ అధికారులు, రైతు సేవా కేంద్రం ఇన్‌ఛార్జిలు, ఎండిఒ లక్ష్మీ కుమారి, కోఆపరేటివ్ సొసైటీ కార్యదర్శి నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రామికులుగా పోలీసులు

ప్రజాశక్తి - ఉండి

తమ పోలీసు స్టేషన్ అభివృద్ధి కోసం పోలీసులే శ్రామికులుగా మారారు. వివరాల్లోకి వెళ్తే ఉండిలోని రైతు సేవా కేంద్రం భవనంలో గత నవంబర్‌లో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. దానిని అభివృద్ధి చేయగా ఇటీవల కురిసిన వర్షాలకు స్టేషన్ ఆవరణలో మట్టి కొట్టుకుపోవడంతో గుంతలు ఏర్పడి పోలీసుల వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవ్వడం దృష్ట్యా స్టేషన్ కానిస్టేబుల్‌లు శంకర్, వెంకటరత్నం, జీప్ డ్రైవర్ నవీన్ ఆ గుంతలు పూడ్చడానికి స్టేషన్ బయట ఉన్న సిమెంట్ స్లాబ్‌ను తవ్వి గుంతలు పూడ్చడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది.

పెద్ద మైక్ సౌండ్‌పై అభ్యంతరం

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సరిపల్లి పంచాయతీ పరిధిలోని పద్మశ్రీ కాలనీలో శుక్రవారం ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఓ ప్రార్థన మందిరం నుంచి పెద్ద మైక్ సౌండ్లు వస్తుండడాన్ని స్థానికులు అభ్యంతరం తెలిపారు. సమీపంలో స్కూల్, కాలనీ ప్రజలు ఉన్నందున్న తక్కువ సౌండ్‌తో ప్రార్థనలు చేసుకోవాలని కోరారు. ఈనేపథ్యంలో ప్రార్థన నిర్వాహకులకు, స్థానికులకు వాగ్వాదం చోటు చేసుకుంది. ఈవిషయం తెలుసుకున్న భజరంగళ్ సభ్యులు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ వెంకటసురేష్ అక్కడికి వెళ్లి ఇరువురితో చర్చలు జరిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్కువ సౌండ్ పెట్టుకోవాలని సూచించారు. భవనాలపై ఏర్పాటు చేసిన మైక్లను తొలగించారు.

నేడు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని పిఎసిసి సొసైటీ కార్యాలయ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం చేయనున్నారు. సొసైటీ ఛైర్మన్‌గా నిప్పులేటి తారక రామారావు, సభ్యులుగా కౌరు నాగేశ్వరరావు, మైలాబత్తుల రాంబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ ప్రమాణ స్వీకారం మహోత్సవానికి విప్ బొమ్మిడి నాయకర్, బిసిసిబి ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ(చిన్న), టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

'జిఎస్‌టి వల్ల సామాన్యులకు లాభం లేదు'

ప్రజాశక్తి - ఆచంట

జిఎస్‌టి వల్ల సామాన్యులకు ఒరిగిందేమీ లేదని, కేవలం ధనవంతులకు ఎసిలు, మోటార్ సైకిల్‌కు మాత్రమే ఉపయోగపడుతుందని రైతు సంఘం నాయకులు నెక్కంటి కృష్ణమూర్తి ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం సామాన్యులకు పనికొచ్చే నిత్యావసర, పాలు, మందులు వస్త్ర దుకాణాల వద్ద ఎంఆర్‌పి రేటు మీద జిఎస్‌టి తగ్గింపు కాకుండా వారు కొనుగోలు చేసిన జిఎస్‌టి ట్రాన్స్‌పోర్ట్‌లో కలిపి ఎంత వరకు వస్తుందని ప్రశ్నించారు. ఈ తరహాలో జిఎస్‌టి తగ్గిన తర్వాత ఆ వస్తువు ఎంతకు అమ్ముతున్నారనేది ప్రతి షాప్ దగ్గర బోర్డులు పెడితే సామాన్యులకు ఎంత మేలు జరుగుతుందో తెలుస్తుందన్నారు. ప్రస్తుతం జిఎస్‌టి తగ్గింపు వల్ల వర్తకులకు మాత్రమే లాభం కలుగుతుందని, జనరిక్ మందులు తెచ్చి కొంతమంది వ్యాపారులు మందుల షాపులో మందు బిల్లులపై ఉన్న రేటుకు విక్రయించడం వల్ల రూ.50కి అమ్మవలసిన టాబ్లెట్స్ రూ.150కి అమ్మకాలు జరుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరహాలో ప్రభుత్వం జనరిక్ మందులపై జనరిక్ అనే ముద్ర వేస్తే కొంతవరకు సామాన్య ప్రజలకు మేలు కలుగుతుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి షాపు దగ్గర స్టాక్ బోర్డులు ఏర్పాటు చేసి సామాన్య ప్రజలకు మేలు చేకూర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

ఛాంపియన్‌గా ఎస్ఆర్‌కెఆర్ మెకానికల్ టీం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఫార్ములా ఆఫ్ రోడ్ మినీ భజ ఇండియా(పోమ్ బి) ఎటివి వెహికల్ పోటీలలో భారతదేశంలో భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఛాంపియన్‌గా నిలిచి జ్ఞాపికలతో పాటు రూ.90 వేల క్యాష్ బహుమతి కూడా అందుకొని దేశంలోనే అరుదైన ఖ్యాతి కళాశాలకు తీసుకువచ్చారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఇస్ని మోటార్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 25 నుండి 29 వరకు భోపాల్‌లోని సాగర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ క్యాంపస్‌లో పోటీలు నిర్వహించారు. అందులో ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్‌కు చెందిన 23 మంది విద్యార్థుల బృందం 'టీం గోదావరి' పేరిట పోటీల్లో పాల్గొన్నారు. ప్రధానంగా ఆల్ టెరైన్ వెహికల్(ఎటివి) వాహనాన్ని మట్టి నీటిలో, మట్టి గుట్టపై నుండి సాఫీగా నడపటం, ఇంధనం ఎకానమీ లోను, లోడ్ టెస్ట్‌లో భాగంగా స్కార్పియో వాహనాన్ని లాక్కుని వెళ్లటం, తక్కువ దూరంలో వేగంగా వెళ్లడం, వాహనం ఆగకుండా మూడు గంటల పాటు నిర్విరామంగా నడపటం వంటి విభాగాల్లో కూడా ప్రథమ స్థానంలో టీం గోదావరి అగ్రస్థానంలో నిలిచిందని మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ కలిదిండి సీతారామరాజు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్స్ ఎన్.సుదీర్ కుమార్ వర్మ, యు.రాజేంద్రప్రసాద్, వివి.మురళీకృష్ణమరాజులు చెప్పారు. దేశవ్యాప్తంగా 13 టీమ్స్ పోటీల్లో పాల్గొనగా ఎస్ఆర్‌కెఆర్ గోదావరి టీం ఛాంపియన్‌గా నిలిచి అన్ని విభాగాలలో తన ప్రాధాన్యత చాటి చెప్పిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీం గోదావరి డ్రైవర్ వై.హరి సూర్య చరణ్, కెప్టెన్ ఎల్.శివమణి మాట్లాడారు. తాము జీవితాంతం గుర్తుండిపోయే విజయాన్ని అందుకున్నామన్న ఆత్మవిశ్వాసాన్ని విద్యార్థుల బృందం వ్యక్తంచేశారు.

తమను కించపరచడం తగదు

సర్పంచి, ఉప సర్పంచి ఆవేదన

ప్రజాశక్తి - పెనుమంట్ర

వాస్తవాలు తెలుసుకోకుండా గురువారం సాయంత్రం పెనుమంట్ర పంచాయతీ వద్ద జరిగిన పల్లె పల్లెకు మన పితాని అనే గ్రామ సభలో సర్పంచి, ఉప సర్పంచిలను కించపరిచే విమర్శలు మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ చేయడం తగదని వారు వాపోయారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పత్రికా సమావేశం జరిపి సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాస రాజు, వార్డు సభ్యులు కొవ్వూరి మోహన్ రెడ్డి, తేతలి ప్రసాద్ రెడ్డి తమ ఆవేదన వెలిబుచ్చారు. అన్ని రకాలుగా సహకరిస్తున్నా ఎంఎల్‌ఎకి స్థానిక టిడిపి నాయకుడు ఒకరు తప్పుదోవ పట్టించి, తమ మీద ఆరోపణలు చేయడానికి కారణం అవుతున్నారని అన్నారు. స్థానిక ఎల్ఇ పాఠశాలలోని విద్యార్థులకు తీరని అన్యాయం జరిగినా దానిని ఎంఎల్‌ఎ పితాని రాజకీయం చేయడం దారుణమని వారు తీవ్రంగా ధ్వజమెత్తారు. సర్పంచి, ఉప సర్పంచిలక ప్రోటోకాల్ ఉన్నా, సభల్లో విస్మరించి మనో వేదన కలిగిస్తున్నారని, దీనిపై ఆర్‌డిఒకు ఫిర్యాదు చేస్తే, వారు ఆర్డర్ ఇచ్చారని, తమ చెక్ పవర్ రద్దుకు ఎంఎల్‌ఎ ప్రయత్నిస్తున్నారని సర్పంచి ఆరోపించారు.

దళితవాడ కాదు.. దరిద్రవాడ

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్ప రాజ్

ఉండి : దళితవాడలోని ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగానే ప్రభుత్వాలు చూస్తూ అభివృద్ధి చేయకుండా దళిత వాడను దరిద్ర వాడగా మార్చేసారని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం మండలంలోని అర్తమూరు గ్రామంలో దళితవాడలో పర్యటించి అస్తవ్యస్తంగా ఉన్న పారిశుధ్యం, అధ్వానంగా ఉన్న రహదారులు, రహదారిపై నిలిచిన మురుగునీరు వంటి వాటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికీ ప్రభుత్వాలు నేటికీ దళితవాడలోని ప్రజలను కేవలం ఓటర్ల గాను, ఎన్నికల వేళల్లో ప్రచార సాధకులుగా చూసారే తప్ప వారి కనీస అవసరాలను తీర్చి దళిత వాడలను అభివృద్ధి చేయడానికి ఏ ఒక్క నాయకుడు కంకణం కట్టుకోలేదని విమర్శించారు. దళితవాడల అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించే ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. గ్రామాలలో ఉండి గ్రామ ప్రజల సమస్య పరిష్కరించాల్సిన గ్రామపంచాయతీ అధికారులు ప్రభుత్వం ఇచ్చే ఇంటి అద్దె తీసుకుంటూ పట్టణాల్లో ఉంటున్నారని, కార్యాలయానికి ఆలస్యంగా వస్తూ ప్రజా సమస్యలను గాలికి వదిలేసారని పుష్పరాజ్ విమర్శించారు. కచ్చా డ్రెయిన్లు ఏర్పాటుచేసి మురుగునీరు రోడ్లపై నిలవకుండా చూడాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దళితవాడలను ఏకంచేసి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ జొన్నల వజ్రం అనే వ్యక్తికి వాహన మిత్ర పథకం అందనివ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ జాప్యం చేశారని జొన్నల వజ్రం గత ప్రభుత్వంలో వాహన మిత్ర పథకంలో నగదు అందుకున్నాడని, కానీ నేడు అధికారుల నిర్లక్ష్యం కారణంగా దూరమయ్యాడని, అధికారులను దీనిపై ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారన్నారు. దీనికి బాధ్యులైన అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

నాబార్డ్ సేవలు విరివిగా అందించాలి : కలెక్టర్

భీమవరం : జిల్లాలో నాబార్డ్ సేవలను విరివిగా అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ నాగరాణితో నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం జనరల్ మేనేజర్ మహేష్ ప్రసాద్ మహాడ్డింగ్ కలిసి జిల్లాలో నాబార్డ్ ప్రస్తుతం చేపడుతున్న పలు కార్యక్రమాలపై వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సేంద్రీయ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం జిల్లాలో రిటైల్ అవుట్‌లెట్లను ప్రారంభించడం, రొయ్యల ఫీలింగ్ షెడ్ ఆధునీకరణ వంటి వాటికి మద్దతు ఇవ్వాలన్నారు. ఈ అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టడానికి జిల్లా యంత్రాంగం నుండి అన్ని విధాలా మద్దతు లభిస్తుందని తెలిపారు. నాబార్డ్ ఉమ్మడి గోదావరి జిల్లాల డిడిఎంలు ఎల్.నిష్యంత్ చంద్ర, టి.అనిల్ కాంత్, నాబార్డ్ అధికారులు రేఖ గోనాల్, గణేష్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షునిగా శ్రీనివాస్

తాడేపల్లిగూడెం : కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడుగా బాల శ్రీనివాస్ నియమితులయ్యారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పాత పార్టీ కుమార్‌రాజు ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసినట్టు శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భీమవరంలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇన్‌ఛార్జి మార్నీడి బాబ్జి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నట్లు ఈ ప్రకటనలో తెలిపారు.